సాక్షి
జగిత్యాల
బుధవారం । 22 । నవంబర్ । 2023



పట్టణ ఓటర్లపైనే గురి..!

ఈసారి ఎన్నికల్లో పట్టణ ఓటర్లే కీలకం కానున్నారు. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ మున్సిపాలిటీల్లో ఉన్న ఓటర్లపైనే ఆశలు పెట్టుకున్నారు. 10లో▸



హమాలీల్లేక.. కొనుగోళ్లు సాగక..

వరికోతలు ప్రారంభమయ్యాయి. రైతులు ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతున్నాయి. 10లో▸

గరిష్టం/కనిష్టం
28.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతం అవుతుంది. సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

వైభవంగా గంగాహారతి



గోదారమ్మకు గంగాహారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి: కార్తీకమాసం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గంగాహారతి కార్యక్రమం మంగళవారంతో ఎనిమిదోరోజుకు చేరింది. ముందుగా ఆలయం నుంచి గోదావరికి మేళతాళాలతో వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరిలో దీపాలు వదిలారు. ఆలయ ఈవో శ్రీనివాస్, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులున్నారు.

తేమ వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొంటాం



లక్ష్మీపూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం గంగాధర్

జగిత్యాలరూరల్: తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేస్తామని ఐకేపీ ఏపీఎం గంగాధర్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం కల్లెడ, తక్కళ్లపల్లి, అనంతారం, లక్ష్మీపూర్, తిమ్మాపూర్, పొరండ్ల గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టిన అనంతరం కొనుగోలు కేంద్రానికి తేవాలన్నారు. రూరల్ మండలంలో 15 కేంద్రాల నుంచి ఇప్పటివరకు 26,460 క్వింటాళ్లు, అర్బన్‌మండలం 4 కేంద్రాల నుంచి 4,840 క్వింటాళ్ల ధాన్యం కొన్నామని తెలిపారు. సీసీలు మరియ, గంగారాం, రవీందర్, వీవోఏలు, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

24న ధర్మపురికి ప్రియాంక గాంధీ

ధర్మపురి: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నాయకురాలు ప్రి యాంక గాంధీ ఈనెల 24న ధర్మపురికి రానున్నట్లు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూ రి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఏర్పా ట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం




మెట్‌పల్లి పట్టణంలో వలలను ప్రదర్శిస్తున్న మత్స్యకారులు

మెట్‌పల్లి: పట్టణంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వలలతో పురవీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. ముందుగా పలువురు మాట్లాడుతూ కుల వృత్తిపై ఆధారపడిన మత్స్యకారులను ప్రభుత్వాలు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు మైలారం గణపతి, ఉపాధ్యక్షులు సంజీవ్ తదితరులున్నారు.

కేసుల చిట్టా విప్పాల్సిందే!

జంగ్ తెలంగాణ

- సుప్రీం ఆదేశాలతో ముందుకు వస్తున్న అభ్యర్థులు
- కేసులు ఉన్నా లేకున్నా దినపత్రికల్లో వెల్లడిస్తున్న వైనం
- కొందరికి అనుకూలం, మరికొందరికి ప్రతికూలం
- నేర స్వభావం చూసి ఓటేయాలంటున్న మేధావులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులందరూ తమపై ఎన్ని కేసులు ఉన్నాయో ప్రజలకు తెలిపేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల నామినేషన్లు వేసిన సమయంలో కేసుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు వాటిని ప్రముఖ దినపత్రికల్లో ప్రకటనల ద్వారా తెలియజేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పారదర్శకంగా వ్యవహరించాలని, ఎలాంటి నేరచరిత్ర ఉన్నా బయటపెట్టాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తమ కేసుల చిట్టాను విప్పుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి మొత్తంగా 216 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇప్పుడు వీరంతా తమపై కేసులు ఉన్నా లేకున్నా పత్రికా ప్రకటనలు అనివార్యంగా ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎవరికీ మినహాయింపు లేదు..

రాజకీయంగా పారదర్శకత పాటించే ఏ నాయకుడికీ ఈ ప్రకటనలు ఇచ్చేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ఎందుకంటే రాజకీయ నాయకుడు అన్నాక కేసులు ఉండటం సర్వసాధారణం. ప్రజాసమస్యల పోరాటంలో భాగంగా అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ఏదో ఒక సమయంలో ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సి వస్తుంది. మన రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమంలో దాదాపు అన్ని పార్టీల నాయకులపైనా కేసులు నమోదయ్యాయి. అందులో చాలామటుకు కొట్టుడుపోగా.. ఇంకొన్ని విచారణ దశలో ఉన్నాయి. కానీ, రాజకీయ జీవితం మొదలు కాకముందు, రాజకీయాల్లోకి వచ్చాక వ్యక్తిగత కారణాలతో నమోదైన క్రిమినల్ కేసులు కొందరిని తీవ్రంగా ఇబ్బంది పెట్టబోతున్నాయి. వీటిలో ప్రధానంగా భూకబ్జాలు, ఫోర్జరీలు, మోసాలు, హత్యాయత్నాలు ఉన్న వారికి ఈ ప్రకటనల జారీ ప్రతికూలంగా మారనుంది. చిన్న కేసు ఉన్నా తక్కువలో తక్కువ 12 సెంటీమీటర్ల పొడవు, వెడల్పు విస్తీర్ణం కలిగిన యాడ్ ఇవ్వాల్సి వస్తోంది. అంతే కాకుండా కేసుల వివరాలు, నేరం స్వభావం, నమోదైన ఐపీసీ సెక్షన్లు, విచారణ స్థితిగతులు తదితరాలు పట్టికలో స్పష్టంగా పొందుపర్చాల్సి ఉంటుంది. కనీసం మూడు రోజులపాటు జిల్లా ప్రజా సంబంధాల అధికారి వద్ద నమోదైన.. గుర్తింపు పొందిన దినపత్రికల్లో ప్రచురించాలి. ఈ వ్యవహారంలో కేసులు లేని వారికి మినహాయింపు ఏమీ లేదు. వారు కూడా తమపై కేసులు లేవని ప్రకటన ఇస్తున్నారు.

వెల్లడించకపోతే న్యాయపరమైన చిక్కులు

అభ్యర్థి నేరాల పట్టికను చదివిన వారికి అతని గుణంపై నిర్దిష్టమైన అభిప్రాయానికి వచ్చే అవకాశాలున్నాయి. స్మార్ట్‌ఫోన్లు వచ్చాక ఏ నేరానికి ఏ సెక్షన్ పెడతారన్నది తెలుసుకోవడం క్షణాల్లో పని. ఎందుకంటే దురుద్దేశంతో చేసిన నేరానికి, ప్రజాపోరాటాల్లో భాగంగా నమోదైన కేసులకు స్పష్టమైన తేడా ఉంటుంది. ఇందులో ప్రజాసమస్యలపై పోరాటాలు చేసిన వారికి ఇది కలిసి వచ్చే అంశం కాగా, ఉద్దేశపూర్వక నేరచరితులకు మాత్రం ముమ్మాటికీ గండమే. ఒకవేళ కేసుల విషయాలు వెల్లడించకపోతే.. సదరు అభ్యర్థి భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోక తప్పదు. ఒక వేళ గెలిచి పదవిలో ఉంటే ప్రతిష్ఠ మరింత దిగజారే అవకాశాలున్నాయి.

నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల వివరాలు..

కరీంనగర్‌లో 27, హుజూరాబాద్‌లో 22, చొప్పదండిలో 14, మానకొండూరులో 10, సిరిసిల్లలో 21, వేములవాడలో 16, పెద్దపల్లిలో 17, మంథనిలో 21, రామగుండంలో 23, జగిత్యాలలో 15, కోరుట్లలో 15, ధర్మపురిలో 15 మంది అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు.

మంచి వ్యక్తులను ఎన్నుకోవాలి

మంచి వ్యక్తిత్వం, సమాజానికి సేవ చేయాలన్న భావాలున్న వ్యక్తులను ఎన్నికల్లో ఎన్నుకోవాలి. వ్యక్తిగత నేరస్వభావం ఉన్న వారి గురించి ఆలోచించాలి. డబ్బులున్న వారికే టికెట్లు ఇచ్చే ధోరణిని రాజకీయ పార్టీలు మార్చుకోవాలి. నైతిక విలువలు, ప్రజల సమస్యలు పట్టించుకునేవారికి ఇవ్వాలి. ప్రజలు కూడా అలాంటి వారికే ఓటు వేయాలి.

– బుర్ర మధుసూదన్‌రెడ్డి,
రిటైర్డ్ ప్రిన్సిపాల్, ఎస్సారార్ కళాశాల

అగ్రనేతలొస్తున్నారు..

- ఉమ్మడి జిల్లాకు ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్, మాయావతి, యోగి, అమిత్‌షా, ప్రియాంక గాంధీ, రేవంత్‌రెడ్డి, పవన్‌కల్యాణ్
- రేపటి నుంచి 28 వరకు వరుస పర్యటనలు
- భారీ బహిరంగ సభలతో హోరెత్తనున్న ప్రచారం
- జనసమీకరణతో బలనిరూపణకు సిద్ధమవుతున్న పార్టీలు



సీఎం కేసీఆర్



ప్రధాని మోదీ



అమిత్‌షా



యోగి



రేవంత్‌రెడ్డి



మాయావతి



ప్రియాంకగాంధీ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ పోలింగ్ సమయం సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలు తమ ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నాయి. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అన్ని పార్టీల అధినేతలు ఉమ్మడి జిల్లాలో ప్రచారం చేసేందుకు రానున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు నుంచే మంత్రి కేటీఆర్ సుడిగాలి పర్యటనలతో గులాబీ శ్రేణుల్లో ఎన్నికల జోష్ నింపారు. షెడ్యూల్ విడుదలయ్యాక సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలోని హుస్నాబాద్ నుంచే ఎన్నికల శంఖారావం పూరించి, పలు నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించారు. బీజేపీకి మద్దతుగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కోరుట్లలో ధర్మపురి అరవింద్‌కు మద్దతుగా బహిరంగ సభలో పాల్గొన్నారు. తాజాగా మరోమారు పెద్దపల్లిలో నిర్వహించే బహిరంగ సభకు రానున్నారు. బీఎస్పీ రాష్ట్ర చీఫ్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో ఆ పార్టీ పెద్దపల్లి అభ్యర్థి దాసరి ఉష జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభ నిర్వహించి సత్తా చాటారు. రామగుండం బీజేపీ అభ్యర్థి కందుల సంధ్యారాణికి మద్దతుగా ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ కవిత రామగిరి, పెద్దపల్లిల్లో ప్రచారంలో పాల్గొన్నారు.

బీఎస్పీకి మద్దతుగా మాయావతి

పెద్దపల్లి బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉషకు మద్దతుగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఈ నెల 23న పెద్దపల్లి జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు.

మరోసారి గులాబీ దళపతి..

సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ అభ్యర్థుల కోసం సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఈ నెల 24న సింగరేణి స్టేడియంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు మద్దతుగా నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు హాజరుకానున్నారు. మంత్రి కేటీఆర్ రామగుండం, మంథనిల్లో రోడ్ షోలు నిర్వహించనున్నారు. వారం రోజుల్లో ఇలా అగ్రనేతలు రానుండటంతో అందరి దృష్టి ఉమ్మడి జిల్లాపై పడింది.

హుస్నాబాద్, ధర్మపురికి ప్రియాంకగాంధీ

ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకా గాంధీ ఈ నెల 24న మధ్యాహ్నం 2 గంటలకు హుస్నాబాద్‌లో, సాయంత్రం 4 గంటలకు ధర్మపురిలో జరిగే బహిరంగ సభలకు హాజరవుతారు. అలాగే, పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావుకు మద్దతుగా 26న నిర్వహించే విజయభేరి సభలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు.

ఏ రోజు ఎవరు..

23న – మాజీ సీఎం మాయావతి (పెద్దపల్లి)
24న – ప్రియాంకా గాంధీ (హుస్నాబాద్, ధర్మపురి)
24న – సీఎం కేసీఆర్ (రామగుండం)
25న – యూపీ సీఎం యోగి (వేములవాడ)
26న – పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి (పెద్దపల్లి)
27న – ప్రధాని మోదీ (కరీంనగర్)
28న – హోంమంత్రి అమిత్‌షా (పెద్దపల్లి)

బీజేపీ అభ్యర్థుల కోసం ప్రధాని మోదీ..

కరీంనగర్ బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు మద్దతుగా ఎస్సారార్ కాలేజీ ఆవరణలో ఈనెల 27న నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ప్రధాని హోదాలో ఆయన మొదటిసారి కరీంనగర్‌కు వస్తుండటంతో భారీ జనసమీకరణతో సభ సక్సెస్ చేసేందుకు ఆ పార్టీ నాయకులు సిద్ధమవుతున్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సైతం ఈ సభకు రానున్నారు. అలాగే, బీజేపీ పెద్దపల్లి అభ్యర్థి దుగ్యాల ప్రదీప్‌రావును గెలిపించాలంటూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈనెల 28న పెద్దపల్లికి రానున్నారు. వేములవాడలో 25న నిర్వహించే బహిరంగ సభలో ఉత్తరప్రదేశ్ సీఎం యోగి పాల్గొననున్నారు. బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పలు నియోజకవర్గాల్లో రోడ్‌షోలలో పాల్గొననున్నారు. అలాగే ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ త్వరలో రామగుండంలో పర్యటించనున్నారు.

పార్టీ ఏదైనా వేదికలు ఇవే..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీల సభలను ఒక్కటే ప్రాంగణంలో నిర్వహిస్తుండటం గమనార్హం. కరీంనగర్‌లో ఎస్సారార్ కాలేజీ గ్రౌండ్, పెద్దపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం, రామగుండంలో సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియమే వేదికలవుతున్నాయి.

పోలింగ్‌కు కట్టుదిట్టమైన చర్యలు

- ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటు
- ఓటర్లకు స్లిప్‌లు పంపిణీ చేయాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా, చిత్రంలో అదనపు కలెక్టర్లు

జగిత్యాల: పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. మంగళవారం జిల్లాల కలెక్టర్లతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పోలింగ్ రోజు అత్యవసర సేవల కింద విధులు నిర్వహించేవారు తమ ఓటు హక్కును ముందస్తుగానే వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని, దరఖాస్తు చేసుకున్న ఓటర్ల కోసం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులకు ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్ల జాబితాను అందించాలన్నారు. పోలింగ్ వందశాతం పెరిగేలా చూడాలని, గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో 60 శాతం వెబ్‌కాస్టింగ్ చేయాలన్నారు. ఓటర్లకు తప్పకుండా స్లిప్‌లు పంపిణీ చేయాలని, నోడల్ అధికారి పంపిణీపై రివ్యూ చేయాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ఈవీఎం యంత్రాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేసేలా చూడాలన్నారు.

ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటు

కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్‌కోసం 1,141 దరఖాస్తులు వచ్చాయని, ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎసెన్షియల్ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు టీంలను ఏర్పాటు చేశామని, ఆయా ఓటర్ల వద్దకు టీంలు ఎన్నికల కమిషన్ వెళ్లి ఓటు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లత, దివాకర, ఆర్డీవోలు రాజేశ్వర్, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

జై శ్రీరాం.. జై హనుమాన్



స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టులోని శ్రీఆంజనేయస్వామి వారిని మంగళవారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులతో ఆలయంతోపాటు ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. ఆలయల అధికారులు వెంటవెంటనే దర్శనం కల్పించారు. ఆలయ ఈవో వెంకటేశ్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్లు శ్రీనివాసశర్మ, సునీల్, ధర్మేందర్, శ్రీనివాసాచారి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంతరిక్ష పరిశోధకులుగా ఎదగాలి

- విద్యార్థులను అభినందించిన ఇస్రో బృందం



విద్యార్థులు తయారు చేసి పంపిన భారీ రాఖీ

కోరుట్ల: విద్యార్థులు అంతరిక్ష పరిశోధన శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఇస్రో శాస్త్రవేత్తల బృందం ఆకాంక్షించింది. పట్టణంలోని కల్లూర్ రోడ్డులోగల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు రాఖీ పౌర్ణమి సందర్భంగా భారీ రాఖీని తయారు చేసి ఇస్రో బృందానికి బహుమతిగా పంపించారు. ఈ మేరకు బృందం సభ్యులు స్పందించి రాఖీ తయరు చేసి పంపించిన విద్యార్థులు, ఉపాధ్యాయబృందాన్ని అభినందిస్తూ పోస్టు ద్వారా పార్సిల్ పంపించారు. ఇందులో డైరీ, చంద్రయాన్–3 ల్యాండింగ్ చిత్రాలు, ఇస్రో పరిశోధన కరపత్రాలు ఉన్నాయని ప్రధానోపాధ్యాయుడు గడెల భూపతి తెలిపారు. పాఠశాల విద్యార్థులు భవిష్యత్తులో అంతరిక్ష పరిశోధకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంఈఓ గంగుల నరేశం ఉపాధ్యాయులు, విదార్థుల కృషిని ప్రశంసించారు. సైన్స్ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, నాగరాజు, విద్యార్థులు మనుజ్యోతి, ఇందు ప్రియ, నందిని, రమణి, ఉషశ్రీ పాల్గొన్నారు.

సీఎం చొరవతో ప్రజల ముంగిటికే వైద్యం

- సంక్షేమ పథకాలకు ఆకర్శితులై చేరిక
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



రేకులపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: సీఎం చొరవతో మెరుగైన వైద్యం ప్రజల ముంగిటకు వచ్చిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ పథకాలకు ఆకర్శితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. వివిధ పార్టీల నుంచి సుమారు 200 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. అన్ని వర్గాలవారికి కేసీఆర్ అండగా ఉంటారని పేర్కొన్నారు.

బీర్‌పూర్‌లో ప్రచారం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రచారం చేశారు. జిల్లాకేంద్రంలో వైద్యకళాశాల నిర్మించామన్నారు. డయాలసిస్ సౌకర్యం, ఇతర అత్యాధునిక సదుపాయాలు కల్పించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు కష్టాలు తప్పవన్నారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, కేడీసీసీబీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు ఉన్నారు.

ఇంటింటా సంక్షేమ పథకాలు

జగిత్యాలరూరల్: బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరాయని జెడ్పీచైర్ పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సతీమణి రాధిక అన్నారు. జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్, రఘురాములకోటలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

రాయికల్‌లో ఇంటింటా ప్రచారం

రాయికల్: సంజయ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి ఆధ్వర్యంలో తాట్లవాయి, కైరిగూడెం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. యూత్ అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు. సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ పట్టణంలో జగిత్యాలకు చెందిన పిల్లల వైద్యులు మోర సుమన్, స్త్రీవైద్య నిపుణులు డాక్టర్ మోర రోజ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వారివెంట నాయకులు బాబా, కో–ఆప్షన్ సభ్యుడు వనిత, మహేందర్ బాబు, హుస్సేన్, రాంమూర్తి తదితరుల పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ వసంత, రాధిక



రాయికల్‌లో ప్రచారం చేస్తున్న జగిత్యాల వైద్యులు మోర సుమన్, మోర రోజ



వాల్గొండలోని శ్రీరామలింగేశ్వర ఆలయం

రామలింగేశ్వర స్వామి నమోనమః

మల్లాపూర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏకైక హరిహరక్షేత్రం.. మల్లాపూర్ మండలం వాల్గొండ గోదావరి తీరాన ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం. ఈ ఆలయంలో కార్తీకమాస ఉత్సవాలను ఈనెల 22 నుంచి 26న నిర్వహించనున్నారు. పౌర్ణమిరోజు లక్ష దీపాలతో అలంకరించనున్నారు. కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి సాధువులు హాజరుకానున్నారు. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా ప్రకటించాలని ఎంపీటీసీ క్యాతం సుజాత, వాల్గొండ తండా సర్పంచ్ ధరంసోత్ కళావతి, వాల్గొండ సర్పంచ్ దండిక గంగు, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ చిలువేరి లక్ష్మి కోరారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సాంబారి శంకర్ తెలిపారు.



శ్రీసీతారాముల ఉత్సవమూర్తులు



దర్శనమిస్తున్న శివలింగం

హమాలీల్లేక.. కొనుగోళ్లు సాగక..

- కేంద్రాల్లో వెంటాడుతున్న కూలీల కొరత
- ఇతర రాష్ట్రాల నుంచి వస్తేనే కొనుగోళ్లు మరూ
- హమాలీ పని చేసేందుకు స్థానిక యువత దూరం


తూకం వేస్తున్న మహారాష్ట్ర హమాలీలు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. రైతులు ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతున్నాయి. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీ పనులు చేసేందుకు స్థానిక యువత ముందుకు రాకపోవడంతో.. ప్రతి సీజన్‌లో ఇతర రాష్ట్రాల హమాలీల కోసం ఇటు రైతులు, అటు అధికారులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

3వేల మంది..

జిల్లాలో వానాకాలం సీజన్‌లో వరి పంటను 3.05లక్షల ఎకరాల్లో సాగు చేయగా.. పంట దిగుబడి 50–60లక్షల క్వింటాళ్లు వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో దొడ్డు ధాన్యాన్ని మాత్రమే పండించడంతో.. ఆ పంటను పూర్తిగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర రూ.2,183 చొప్పున అమ్మేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో వరి ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రంలో పోసిన తర్వాత ధాన్యాన్ని సంచుల్లో నింపడం, నింపిన సంచులను కాంటా వరకు తీసుకెళ్లి తూకం వేయడం, తూకం పూర్తయిన తర్వాత సుతిలితో కుట్టడం, లారీ వచ్చిన తర్వాత అందులోకి ఎక్కించడం చేయాల్సి ఉంటుంది. ఈ పనులను చేయడానికి హమాలీలు అవసరమవుతారు. జిల్లాలో దాదాపు 400 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీని ప్రకారం చూస్తే.. ఒక్కో కొనుగోలు కేంద్రానికి ఆరేడుగురు అవసరమవుతారు. జిల్లా మొత్తమ్మీద దాదాపు 3వేల వరకు హమాలీలు అవసరం. అంతేకాకుండా కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం రైస్‌మిల్లులకు చేరిన తర్వాత కూడా దించడానికి హమాలీలు అవసరం. జిల్లాలోని 128 రైస్‌మిల్లులకు కనీసం ఒక్కోదానికి మిల్లు సామర్థ్యాన్ని బట్టి 10 నుంచి 15 మంది హమాలీలు అవసరం. దీన్ని బట్టి జిల్లాకు మరో 1500 మంది హమాలీలు అవసరమవుతారు. ఇలా జిల్లాలో ధాన్యం కొనుగోలులో దాదాపు 5వేల వరకు హమాలీలవసరమవుతారు.

ఇతర రాష్ట్రాల హమాలీల వైపు చూపు..

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఇతర రాష్ట్రాల హమాలీలు వచ్చి నెల రోజుల పాటు కొనుగోలు కేంద్రాల్లోనే ఉంటారు. అక్కడే భోజనం వండుకోవడం, లారీలు ఏ సమయంలో వచ్చిన లోడ్ చేయడం, అక్కడే పడుకోవడం వంటివి చేస్తుంటారు. మహారాష్ట్రలోని నాందేడ్, అమరావతి, బీహార్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో నీటి వసతులు సరిగా లేక అక్కడ పంటలు పెద్దగా పండే పరిస్థితి లేదు. దీంతో ధాన్యం కొనుగోలు రెండు సీజన్లలో అక్కడివారు ఇక్కడ పని చేసేందుకు వస్తుంటారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని బట్టి ఒక్కో హమాలీ కనీసం రూ.30–50వేలు సంపాదిస్తాడు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో గతంలో ఉన్న పరిచయాలను బట్టి కేంద్రాలకు కొందరు హమాలీలు నేరుగా వస్తుంటే.. మరికొందరు దళారీల ద్వారా ఇక్కడ పని చేసేందుకు వస్తుంటారు.

యువత దూరం..

జిల్లాలోని ప్రతి గ్రామంలో ఒకటి నుంచి రెండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో ఆయా గ్రామ యువకులే హమాలీ పనులు చేస్తే.. యువతకు ఉపాధి, రైతులకు హమాలీల బాధ తప్పేది. అయితే స్థానిక యువకులు అక్కడక్కడ హమాలీ పని చేసేందుకు మొగ్గు చూపుతున్నా.. చాలాచోట్ల హమాలీ పనిని చిన్నచూపుగా భావించి యువత మొగ్గు చూపడం లేదు. కొన్ని గ్రామాల్లో హమాలీలకు డిమాండ్ ఉండటంతో.. రైతులు క్వింటాల్‌కు రూ.40–50 వరకు చెల్లించే పరిస్థితి నెలకొంది. ఇది చాలదన్నట్టు కొందరు రైతులు అత్యుత్సాహంతో తమ ధాన్యం తొందరగా తూకం వేయాలని అదనపు డబ్బులు ఇవ్వడంతో పాటు బీర్లు, బిర్యానీ ఆఫర్లు చేయడం వంటివి ఇతర రైతులకు పెద్ద తలనొప్పిగా మారాయి.

ఫోన్ చేసి పిలుస్తాం



కొన్నేళ్లుగా జగిత్యాల సింగిల్‌విండో ఏర్పాటు చేసిన నాలుగైదు కొనుగోలు కేంద్రాల్లో ఇతర రాష్ట్రాల హమాలీలు పని చేస్తున్నారు. ప్రతి సీజన్‌లో ఆయా రాష్ట్రాల హమాలీలు వచ్చేవరకు కొనుగోళ్లు జరిగే పరిస్థితి లేదు. ప్రతి సీజన్‌కు ముందు ఫోన్లు చేసి పిలుపిస్తుంటాం.

– పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్, జగిత్యాల

ఇతర రాష్ట్రాల వారే దిక్కు



ప్రతి సీజన్‌లో ఐకేపీ, సింగిల్‌విండో కేంద్రాల్లో ధాన్యం తూకం వేసేందుకు, లారీలో లోడ్ చేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి హమాలీలు వస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు గతంలో ఆయా కేంద్రాల్లో పని చేసిన హమాలీలకు ఫోన్ చేసి రమ్మంటారు.

– ప్రకాష్, జిల్లా మార్కెటింగ్ అధికారి, జగిత్యాల

దునియా గిట్ల మారవట్టె..!



పెగడపల్లి: అరె తమ్మి.. గి ఊళ్లె మనకు మంచి పట్టున్నట్టుంది. ఓటడిగిన ప్రతొక్కలు భరోసా ఇస్తుండ్రు. జర మనసు నిమ్మలమైతంది అంటూ ఓ ఊరిలో ప్రచారం ముగిస్తూ ఊరు దాటిన ఓ పార్టీ నాయకుడు తన అనచరుడితో అన్నడు. ఏమోనన్న.. నాకైతే గీల్ల(ఓటర్ల) కిటుక్కు తెలుత్తలేదు. గిప్పుడు మనకే ఓటేస్తమని మాటిచ్చిన గాల్లంతా.. నిన్ననే ఎదుటి పార్టోల్లకు మాటిచ్చిండ్రనే మాట విన్న. పెచారం మద్దెల పోరగాల్లు మాట్లాడుతుంటే జెర చెవి పెట్టిన. ప్చ్.. ఏం జేస్తమన్నా.. దునియా గిట్ల మారవట్టె అంటూ తమ నాయకుడికి గుండె నిబ్బరాన్ని పెంచాడు. అవ్ తమ్మీ.. పక్కగా సెప్పినవ్. గప్పటి ఎలచ్చన్ల లెక్క గిప్పుడు ఓటర్లు లేరు. శానా మార్పులొచ్చినయ్. లీడర్ల మాటలిని గాల్లు కూడా మస్తుగా మాటలు నేర్సింర్రు. ఏం జరుగుతదో సూద్దాం అంటూ కారెక్కి పక్క ఊర్లో ప్రచారానికి బయలుదేరిండు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


గంగారాం(ఫైల్)

రాయికల్: రాయికల్ పట్టణానికి చెందిన ఇంద్రాల గంగారాం(38) అనే యువకుడు మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. గంగారాం ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో జీవితం మీద విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురున్నారు.

క్లుప్తంగా

పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూం పరిశీలన


స్ట్రాంగ్ రూం భద్రతపై సూచనలిస్తున్న ఎస్పీ అఖిల్

సిరిసిల్లక్రైం: పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూంను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూం వద్ద కేంద్ర సాయుధ బలగాలు ఏర్పాటు చేసిన గార్డ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్, సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్, ఎస్బీ సీఐ అనిల్‌కుమార్, తహసీల్దార్ షరీఫ్ మొహినొద్దీన్ ఉన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ధర్మారం(ధర్మపురి): బుచ్చయ్యపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే గ్రామంలో ఉంటున్న పల్లెవారి గణేశ్(48) అక్కడికక్కడే మరణించాడు. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం తుమ్మవారిగూడేనికి చెందిన పల్లెవారి గణేశ్.. బుచ్చయ్యపల్లి గ్రామానికి వలస వచ్చి కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం గణేశ్ బొట్లవనపర్తి నుంచి బుచ్చయ్యపల్లికి సైకిల్ వస్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ట్రాలీ ఢీకొట్టింది. గణేశ్ ట్రాలీవెనుక టైర్‌కింద పడి దుర్మరణం చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

భగవద్గీతను అనుసరించాలి

- శ్రీమాన్ నంబి వేణుగోపాలచార్య కౌశిక


ప్రవచిస్తున్న శ్రీమాన్ నంబి వేణుగోపాలచార్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రతి ఒక్కరూ భక్తి భావంతో నిత్యం భగవద్గీతను అనుసరించాలని జగిత్యాలకు చెందిన శ్రీమాన్ నంబి వేణుగోపాలచార్య కౌశిక అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదన 63వ వార్షికోత్సవంలో భాగంగా కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం శ్రీమద్భాగవత సప్తాహం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు ప్రవచనాలు వినిపించారు. భగవద్గీతను అనుసరించి ముందుకు సాగితే అన్ని శుభాలు జరుగుతాయన్నారు. భక్తితోనే ముక్తి లభిస్తుందని, ప్రతిరోజు దేవుడిని కొలుస్తూ పనులు చేపట్టాలని, అన్ని విజయవంతమవుతాయని అన్నారు. సృష్టిలో దేవుడిని మించిన శక్తి మరోటి లేదన్నారు. భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE AT : JAGTIAL
I.A. No. of 2023 in
O.S. No. 309 of 2022
Between:
1. Marripelly Archana, 2. Bavu Ashwini, 3. Miyyapuram Aparna ... Petitioners/ Plaintiffs.
And
Balasani Santhosh ... Respondent/ Defendant
NOTICE
To,
Balasani Santhosh, S/o. Malla Goud, age: 37 yrs, Occ: Agriculture, R/o. Bhupathipur village of Raikal Mandal, District Jagtial.
Whereas the above plaintiffs filed a suit vide O.S. No. 309 of 2022 against the defendant seeking relief of declaration that the plaintiffs are the legal heirs of late Kathi Narsaiah and late Kathi Rajamma.
Whereas in several times notices were sent to you, but you are evading to receive the notices. The above case is stands posted on 8-12-2023 at 10:30 A.M. for your appearance before this Hon'ble Court to counter and defense if any, failing which the matter will be decided in your absence.
Date: 20-11-2023 Sd/-., Counsel for the Plaintiffs
Karvathula Bhoomaiah, M.A., LL.B., Advocate
H.No. 7-6-103/2, Vidyanagar, Jagtial town and District. Cell: 9440489623

పట్టణ ఓటర్లపైనే గురి..!

- స్థిరపడిన వారే కీలకం
- ముఖ్య నేతలకు బాధ్యతలు
- మచ్చిక చేసుకునే ప్రయత్నం
- పెరిగిన ఓటర్లు 11,251



జగిత్యాల: ఈసారి ఎన్నికల్లో పట్టణ ఓటర్లే కీలకం కానున్నారు. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ మున్సిపాలిటీల్లో ఉన్న ఓటర్లపైనే ఆశలు పెట్టుకున్నారు. పట్టణాలకు ఎక్కువగా చుట్టుపక్కల ఉన్న గ్రామీణ ప్రాంతాల ప్రజలే వచ్చి స్థిరపడ్డారు. జిల్లాకేంద్రంలోనే లక్షకుపైగా ఓటర్లు ఉండగా.. ఇందులో 50శాతం వరకు స్థిరపడినవారే. అలాగే కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల్లోనూ ఇలాగే వచ్చి స్థిరపడిన వారు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వీరు పిల్లల చదువుల కోసం.. వివిధ ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం వచ్చిన వారే. దీంతో వీరి ఓట్లు రాబట్టుకునేందుకు గ్రామీణ ప్రాంతాల్లో తెలిసిన వారితోపాటు సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్య నాయకులను ప్రధాన పార్టీల అభ్యర్థులు కలుస్తూ పట్టణాల్లో ఎవరెవరు ఉన్నారంటూ ఆరా తీస్తూ.. పట్టణాల్లో వారిని కలుసుకుని మద్దతు కోరుతున్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ముఖ్య నాయకులను పట్టణంలో వాడవాడలా ఇంటింటికీ తీసుకెళ్తూ ప్రచారం చేయిస్తున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో దాదాపు చుట్టు ఉన్న గ్రామాల్లో ఉన్న అనేకమంది ఇక్కడే స్థిరపడ్డారు. నిత్యం ఇక్కడి నుంచి వారివారి గ్రామాలకు వెళ్తూ వ్యవసాయం, తదితర పనులు చేసుకుంటూ మళ్లీ సాయంత్రం వరకు పట్టణానికి చేరుకుంటారు. కొందరు గ్రామీణ ప్రాంతాల్లో ఉంచుకున్నప్పటికీ ఎక్కువ శాతం మంది పట్టణాల్లోనే ఓటు హక్కు కలిగి ఉన్నారు. దీంతో వారి ఓట్లు ఎలాగైనా రాబట్టాలనే ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన ముఖ్య నాయకులను ఇక్కడే మకాం వేసి వారి ఓట్లు రాబట్టేలా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అలాగే ఇటీవల యూత్ ఓటర్లు ఎక్కువగా నమోదైంది పట్టణాల్లోనే. యువ ఓటర్లు సైతం అత్యధికంగానే ఉన్నారు.

ఊపందుకున్న ప్రచారం

ఎన్నికల సమయం దగ్గర పడటంతో ప్రచారం ఊపందుకుంది. ఇప్పటికే వాహనాలు, ప్రచార రథాల ద్వారా ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సర్వశక్తులా ప్రయత్నాలు చేస్తున్నారు. ఉదయం గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం చేసి సాయంత్రం వేళ పట్టణాల్లో నిర్వహిస్తూ రాత్రిపూట ముఖ్య నేతలతో అంతర్గత సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రచారం చేపట్టిన గ్రామాల్లో రోజువారి పరిణామాలు తెలుసుకుని అనుకూలంగా ఉందా, ప్రతికూలమా అని లెక్కలేసుకుంటున్నారు. ప్రతిరోజు ప్రచారంతో పాటు, ఓట్లు ప్రతి గ్రామాల్లో, పట్టణాల్లో ఎన్ని వస్తాయో లెక్కలు సైతం వేసుకుంటున్నారు. పోలింగ్ తేదీ దగ్గరపడ్డప్పటికీ గంపగుత్తగా ఓట్లకు గాలం వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు తమదైన శైలిలో వారి ముఖ్య నాయకులను రంగంలోకి దింపి ఎలాగైనా ఓట్లు వచ్చేలా చూస్తున్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో ఉన్న సంఘాలతో సమావేశమవుతూ రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారు. ముఖ్యంగా కుల సంఘాలు, యూనియన్లపై దృష్టి సారిస్తున్నారు. ఎలాగైనా ఓట్లు రాబట్టుకునేలా చూస్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి వచ్చేలా..

నియోజకవర్గాల్లో ఓటు హక్కు ఉన్నప్పటికీ ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని ఇప్పటి నుంచే ఇక్కడికి రప్పించే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. వారికి వచ్చిపోయే ఖర్చులు భరిస్తామని, గూగుల్‌పే, ఫోన్‌పేలకు నంబర్లు సైతం తీసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రతి ఓటు కీలకం కావడంతో సుదూర ప్రాంతాలకు చెందిన ప్రజలను ఇక్కడకు తీసుకువచ్చి ఓటు వేసేలా కొంత ముఖ్య నేతలను కేటాయించారు. వారు వారికి ఫోన్ చేస్తూ వివరాలు తీసుకుంటూ వారిని రప్పించేలా చూస్తున్నారు.

నియోజకవర్గాలవారీగా ఓటర్ల వివరాలు	
కోరుట్ల	2,40,855
జగిత్యాల	2,31,468
ధర్మపురి	2,26,880

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌పై వివాదం

- సోషల్ మీడియాలో వైరల్


మల్యాలలో ఎన్నికల అధికారులు

చందుర్తి(వేములవాడ): మండలంలోని మల్యాలలో మంగళవారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌పై ఎన్నికల అధికారులు, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలపై బీఆర్‌ఎస్ నాయకులకు సమాచారం లేదో ఏమోగానీ అనుకున్న సమయంలో పోలింగ్ ఏజెంట్ పాసులు తీసుకోలేకపోయారు. దీంతో వారిని పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ వద్దకు వచ్చేందుకు ఎన్నికల అధికారులు నిరాకరించారు. గ్రామానికి చెందిన చింతం మల్లేశం అనే దివ్యాంగుడు ఓటు వేసే సమయంలో అతడి భార్య అందుబాటులో లేకపోవడంతో అతడి చిన్నమ్మతో ఓటు వేయించాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. అందుకు మల్లేశం నిరాకరించి కాంగ్రెస్‌కు చెందిన సంటి ప్రసాద్‌ను పంపించాలని కోరాడు. ప్రసాద్ సహాయంతో ఓటు వేశాడు. దీంతో అక్కడే ఉన్న బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గ నాయకుడు ఈర్లపెల్లి రాజు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయిస్తున్నారంటూ ఎన్నికల అధికారులతో వాగ్వాదానికి దిగాడు. ఈక్రమంలో మల్లేశం సూచించిన వ్యక్తితో ఓటు వేయించామని బదులిచ్చి అక్కడి నుంచి అధికారులు వెళ్లిపోయారు. ఈ ఘటనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని రాజు పేర్కొన్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ విషయమై సెక్టార్ అధికారి రవీందర్‌ను వివరణ కోరగా.. వివాదం ఏమీ జరగలేదని చెప్పారు. కాగా మండలంలోని మల్యాలలో 18 మంది, సనుగులలో 12, లింగంపేటలో ఆరుగురు పోస్టల్ బ్యాటెల్ పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

21 లీటర్ల నాటుసారా స్వాధీనం


బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

సారంగాపూర్: రేచపల్లి, దాని చుట్టు పక్క గ్రామాల్లో మంగళవారం ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. 900 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 21 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. మ్యాడారంతండాకు చెందిన బానావత్ జగన్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై 10 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, సిబ్బంది మోహన్‌లాల్, గట్టయ్య, చంద్రశేఖర్, సుమలత పాల్గొన్నారు.

యువతి బలవన్మరణం


గంగజల(ఫైల్)

కోరుట్లరూరల్: పైడిమడుగు గ్రామంలో తోకల గంగజల (22) అనే యువతి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. డిగ్రీ పూర్తి చేసిన గంగజల కొంతకాలంగా కడుపు నొప్పితో బాధ పడుతోంది. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మృతురాలి తండ్రి తోకల దేవయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తోకల దేవయ్య–నర్సవ్వ దంపతులకు కుమారుడు, కూతురున్నారు. కూతురి మృతితో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పైడిమడుగు గ్రామానికి చెందిన సంకె మణిదీప్(24) అనే యువకుడు మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కోరుట్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స అందిస్తున్నారు. పైడిమడుగులో ఒకేరోజు గంగజల ఆత్మహత్య చేసుకోవడం, మణిదీప్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం చర్చనీయాంశమైంది.

బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి


ఆలయ బాధ్యులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలను ప్రశాంత వాతవరణంలో శాంతియుతంగా నిర్వహించుకోవాలని సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్ అన్నారు. ప్రతీ కార్తీకమాసంలో అంగరంగ వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులతో ఏర్పాట్లపై చర్చించారు. ఏటా ఇదే మాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు హైదరాబాద్, కరీంనగర్, కామారెడ్డి, సిద్దిపేట, జగిత్యాల జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. అందుకు అనుగుణంగా ఆలయ కమిటీ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయడం ఆనవాయితీ. అయితే వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసుల సహకారం తీసుకోవాలని సీఐ సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రోజు జరిగే కార్యక్రమాల సమాచారం పోలీసులకు అందించాలన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, వైస్ చైర్మన్ గంట వెంకటేశ్‌గౌడ్, వేదపండితులు నవీన్ చారి, గోపాలచారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఆశీర్వదించండి


మెట్‌పల్లి: కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యేతో కల్వకుంట్ల సంజయ్

- కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కోరుట్ల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో తనకు ఓటేయాలని ఆ పార్టీ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ కోరారు. పట్టణంలోని పలుచోట్ల మంగళవారం కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో ఉన్న రెండు మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.100కోట్లను కేటాయించిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సంజయ్ సతీమణి ప్రచారం

కోరుట్ల: పట్టణంలోని 1, 29 వార్డుల్లో కల్వకుంట్ల సంజయ్ సతీమణి దీప్తి ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ భరోసా పథకాలను వివరించారు. కౌన్సిలర్లు సంగ మాలతి–లింగం, యాటం పద్మ, కో–ఆప్షన్ సభ్యుడు అన్వర్, మాజీ కౌన్సిలర్ గంద్రశిల్ప, నాయకుడు గుర్రాల ప్రవీణ్ పాల్గొన్నారు.

మాదిగ హక్కుల దండోరా మద్దతు

సంజయ్‌కు తమ మద్దతు తెలుపుతున్నట్టు తెలంగాణ మాదిగ హక్కుల దండోరా నాయకులు ఈట్‌రాజు మాదిగ, జన్ను కనకరాజు మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మణ్ మాదిగ, రమేశ్ మాదిగ, సత్తయ్య మాదిగ, భూమయ్య మాదిగ, వేముల బాల్‌రాజ్ మాదిగ, స్వర్ణ మాదిగ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌నే గెలిపించాలి

మల్లాపూర్: ప్రజా సంక్షేమం కోసం సీఎం అహర్నిషలు కృషి చేశారని, బంగారు తెలంగాణ నిర్మాణానికి మళ్లీ బీఆర్‌ఎస్‌నే గెలిపించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు బదినపెల్లి ప్రేమ్, సిరిపూర్ సర్పంచ్ భూక్య గోవింద్‌నాయక్, ప్యాక్స్ చైర్మన్ బద్దం అంజిరెడ్డి కోరారు. మండల కేంద్రంతో పాటు సిరిపూర్ గ్రామంలో సంజయ్‌కుమార్‌కి మద్దతుగా ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రచారం నిర్వహించారు.



కోరుట్ల: 29వ వార్డు ప్రచారంలో సంజయ్ సతీమణి దీప్తి

సోదరి ప్రచారం

ఇబ్రహీంపట్నం: తమ్ముడు సంజయ్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటా సోదరి సమత ప్రచారం చేశారు. ప్రతి వాడలో తిరుగుతూ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చేసిన అభివృద్ధి పనులతో కూడిన కరపత్రం, కేసీఆర్ ప్రవేశపెట్టిన కరపత్రాలను పంపిణీ చేశారు. బర్దీపూర్ గ్రామంలో సర్పంచ్ సంగం సాగర్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, సర్పంచ్ సున్నం నవ్యశ్రీ, సంగం సాగర్, ఎంపీటీసీ దొశెట్టి మమత, సింగిల్‌విండో చైర్మన్ అంకతి రాజన్న, మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్‌రెడ్డి, ఉప సర్పంచ్ దశరథ్, గ్రామ అధక్షుడు శివరాజం, నాయకులు సున్నం సత్యం, పెంట లింబాద్రి, దొశెట్టి రాజరెడ్డి, జాజాల జగన్‌రావు, జేడి సుమన్, వెల్ముల శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీరాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.రాజగోపాల్ మాట్లాడుతూ, దేశంలో ప్రతి 4 నిమిషాలకు ఒకరు రహదారి ప్రమాదంలో ఎక్కువగా యువత ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ ప్రమాదాలతో కుటుంబ సభ్యులకు ఆవేదన, దేశ ఆర్థిక పరిస్థితికి పెద్ద ఎత్తున నష్టం జరుగుతోందన్నారు. అనంతరం ముఖ్య అతిథి మండేపల్లి డ్రైవింగ్ స్కూల్ ట్రైడ్స్ ప్రిన్సిపాల్ రాఘవన్ మాట్లాడుతూ, లైసెన్స్ లేకుండా వాహనాలను నడపవద్దన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారులో సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే 108కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీదేవి, రవికుమార్, ప్రభాకరాచారి, కృష్ణ, మనోహర్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాఘవన్



రోడ్డుపై ధాన్యం.. జర పైలం..!

మల్యాల: రైతులు రోడ్డు వెంట ధాన్యం పోయడంతో ప్రమాదకరంగా మారాయి. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసుకునేందుకు స్థలం లేక రైతులు రోడ్డుపై ధాన్యం కుప్పలు పోశారు. రాత్రి రోడ్డు వెంట వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలి. గతంలో ధాన్యం కుప్పలతో వాహనదారులు ప్రమాదాల బారిన సంఘటనలున్నాయి. రోడ్డుకు కొంత దూరంలో ధాన్యం పోసుకోవాలని, రోడ్డుపై ఉంచి ప్రమాదాలకు కారణం కావొద్దని వాహనదారులు కోరుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
HOUSE FOR SALE
House for sale Ganesh nagar to Tirumal nagar road, 77yards, Karimnagar. Cell: 9701743067, 9441833259 [K-1185676]

SERVICES
ష్యూరిటీ, సెక్యూరిటీ, వ్యక్తిగత, వ్యాపార, వ్యవసాయంపై అతి తక్కువ వడ్డీతో రుణం ఇవ్వబడును. Mr. Rohit Wonder Capital PH: 9041114468 [W-788952]

OLD AGE HOME
ఒమేగా హోమ్‌కేర్ వంట/ఇంటి పనిచేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. Ph: 8977639664/ 8977639665 [H-793653]

www.sakshi.com

WANTED
మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221873]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824